క్లుప్తంగా

సీతారామ చంద్రస్వామి ఆలయ 11వ వార్షికోత్సవం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం సీతారామ చంద్రస్వామి, పోలేరమ్మ దేవస్థానం 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మూలవిగ్రహాలకు అభిషేకాలు, శాంతి హోమం, పూర్ణాహుతి, సీతారాముల కల్యాణం, మహామంగళ హారతి వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.

నేడు సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల శిరిడీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం సందర్భంగా సాయిబాబాకు ఆదివారం ప్రత్యేక పూజలు చేయనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానం, సాయంత్రం 5 గంటలకు పల్లకీలో ద్వారకామాయి బాబా విగ్రహం గ్రామోత్సవం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజావ్యతిరేక బీజేపీని సాగనంపుదాం

పుల్లలచెరువు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో పుల్లలచెరువులో శనివారం ర్యాలీ నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవేండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవనం కష్టతరంగా మారిందన్నారు. కోటి ఉద్యోగాల హామీ అటకెక్కినట్లు ఆవేదన వ్యకం చేశారు. మోదీని గద్దె దించి దేశాన్ని కాపాడుకోవాలే నినాదంతో ఈ నెలాఖరు వరకు ఉద్యమం చేపడుతున్నట్లు చెప్పారు. నాయకులు గురునాథం, తిరుమలయ్య, విశ్వరూపాచారి, కనకచారి, జయరావు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 17న సోమవారం దివ్యాంగులకు బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు వికలాంగుల మండల అధ్యక్షుడు కాశయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మేళా నిర్వహిస్తామన్నారు. పొదిలి ఆర్టీసీ డిపో సిబ్బంది బస్‌పాస్ మేళాలో పాల్గొంటారన్నారు. దివ్యాంగులు తమ ఆధార్, సదరం జిరాక్స్ కాపీలు, పాస్‌ఫోటో, రూ.100 నగదు తీసుకుని ఎంపీడీఓ కార్యాలయంలో బస్‌పాస్ పొందొచ్చని, ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కాశయ్య కోరారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు

కొమరోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగియడంతో విద్యార్థులు ఉత్సాహంగా ఇళ్లబాట పట్టారు. మండలంలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా కట్టుదిట్టమైన భద్రత నడుమ పరీక్షలు నిర్వహించినట్లు ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పొదిలి రూరల్: ప్రభుత్వం పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.కె జైన్‌లాబ్దిన్ అన్నారు. శనివారం పొదిలి మండలంలోని ఉప్పలపాడు రైతు భరోసా కేంద్రంలో రైతుమిత్ర గ్రూపు సభ్యులకు సబ్సిడీపై వైఎస్సార్ వ్యవసాయ యంత్ర సేవా పథకం కింద వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదిలి మండలంలో 17 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 14 ఆర్బీకేలకు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా వ్యవసాయ పనిముట్లు రైతులకు అందించామన్నారు. పొదిలి 1,5,6 ఆర్బీకేలకు ఇంకా వ్యవసాయ పనిముట్లు అందించాల్సి ఉందన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ప్రతి రైతు భరోసా కేంద్రానికి రూ. 15 లక్షలతో వ్యవసాయ పనిముట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. పనిముట్లను అద్దెకు ఇచ్చి తద్వారా వచ్చిన రాబడితో పీడీసీసీ బ్యాంకు వారు ఇచ్చిన రుణాన్ని సంఘ సభ్యులు సులభంగా తీర్చుకోవచ్చన్నారు. ఉప్పలపాడు అభయ ఆంజనేయ రైతు మిత్ర గ్రూపునకు రూ. 8,34,800 లక్షల విలువ చేసే ట్రాక్టరు, ట్రక్కు ఇస్తామని చెప్పారు. రూ. 2.60 లక్షలు సబ్సిడీ ఉంటుందని తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

పెద్దారవీడు: ప్రభుత్వం ద్వారా రాయితీపై అందించే వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి కోరారు. మండలంలో చట్లమిట్ల రైతు భరోసా కేంద్రంలో క్లస్టర్ హీరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) సభ్యులకు వైఎస్సార్ యంత్ర సేవ కేంద్రం ద్వారా వ్యవసాయ యంత్ర పరికరాలు శనివారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ 5 ట్రాక్టర్ల ట్రక్కులు, 4 గోర్లు, 3 గుంటకలు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశామని, మొత్తం ఖరీదు రూ.13.95 లక్షలు ఉంటుందని,



ఉప్పలపాడులో రైతుమిత్ర గ్రూపునకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఏఓ

ప్రభుత్వం రాయితీపై రూ 3.90 లక్షలకు ఇస్తుందని, మిగిలిన డబ్బులు పీడీసీసీ బ్యాంకు అప్పుగా ఇస్తుందని, గ్రూపు సభ్యులు కంతులు వారీగా తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాంక్ అధికారులు, వీపీఏలు, సీహెచ్‌సీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై శిక్షణ

పుల్లలచెరువు: మట్టి నమూనాల సేకరణపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం మండలంలోని యండ్రపల్లి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వై.పాలెం ఏడీ నీరజ మాట్లాడుతూ మట్టి నమూనాలు గట్ల పక్కన, నీడలో, నీళ్ల ఉండే చోట, గుంటల్లో మట్టి నమూనాలు తీయవద్దన్నారు. తప్పని సరిగా చదరంగా ఉన్న చోటే తీయాలని, మట్టి నమూనాలను వి ఆకారంలో తీసుకోవాలని, చుట్టుపక్కల భూమిలోని అన్నీ పొరలు వచ్చే విధంగా తీయాలన్నారు. తర్వాత నీడలో ఆరబెట్టి చతుర్విభజన పద్ధతి ద్వారా చివరిగా 500 గ్రాముల మట్టిని నమూనాగ పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

రాచర్ల: మట్టి నమూనా సేకరణ కార్యక్రమాలకు రైతులు సహకరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని చోళ్లవీడు రైతు భరోసా కేంద్రంలో శనివారం మండల స్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా రైతులు వ్యవసాయంలోని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఏఓ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

కొనకనమిట్ల: రైతులు ఆధునిక పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకొనేలా అవగాహన కలిపించాలని దర్శి ఏడీఏ నిర్మలాదేవి పేర్కొన్నారు. శనివారం కొనకనమిట్ల ఆర్బీకేలో మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షలతో రైతులకు ఉపయోగపడే విషయాలపై ఏఓ ప్రసన్న రంగలక్ష్మి, వ్యవసాయశాఖ సహాయకులతో నిర్వహించిన కార్యక్రమంలో పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులతో కలిసి మట్టి నమూనా పరీక్షలు చేయించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకాన్ని నిర్ణయించుకోవచ్చని తద్వార పంట మంచి దిగుబడి సాధించవచ్చని అన్నారు. కొత్తగా పాస్‌బుక్ వచ్చిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు.



యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్న ఏఓ



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వేడుకగా సీతారామ కల్యాణం



గొట్లగట్టులో భజనలు చేస్తున్న భక్తులు



కొనకనమిట్ల: పూజలు చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

కొనకనమిట్ల: అంతా రామమయం.. జగమంతా రామమయం అంటూ సీతారాముల కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వింజవర్తిపాడులో పట్టాభిరామస్వామి ఆలయాల్లో శనివారం సీతారాముల కల్యాణాన్ని భక్తుల కోలాహలంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం రైతులు తమ ఎడ్లను పూజించి స్వామివారికి పానకం బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. గొట్లగట్టులో సీతారాముల వారికి పదహారు రోజుల పండగ ఉత్సవం నిర్వహించారు.

వెలుగొండలో భక్తుల సందడి

నమో వేంకటేశాయా నమోనమః అంటూ మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వర స్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండల తహసీల్దార్ కేతబోయిన ప్రవీణ్‌కుమార్ వెలుగొండస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు డీటీ ప్రకాష్, వీఆర్ఓలు దిలీప్ కుమార్, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు. అలాగే వాగుమడుగు పంచాతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు, అభయాంజనేయస్వామికి అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఎస్‌ఐకు వైఎస్సార్ సీపీ నేతల అభినందనలు



ఎస్‌ఐకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పుల్లలచెరువు: పుల్లలచెరువు ఎస్‌ఐగా విధుల్లో చేరిన వై.శ్రీహరిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి కలిసి శనివారం అభినందనలు తెలిపారు. కన్వీనర్‌తో పాటు సర్పంచ్‌లు ఆవుల కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ ఎల్.రాములు, రైతు సంఘ నాయకుడు జానకీ రఘు, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఉప సర్పంచ్ రమణారెడ్డి, నాయకులు బచ్చయ్య, ఆంజనేయులు, మూర్తెయ్య, యూషఫ్‌బాష, గురువయ్య, కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు ఎస్‌ఐను కలిసి అభినందనలు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించాలి



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



ప్రమాదాల నివారణపై అవగాహన

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అగ్నిమాపకశాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, వాటి నుంచి ప్రజలు ఏ విధంగా రక్షించుకోవాలనే వాటిపై సిబ్బంది సూచనలు సలహాలు అందజేశారు. 1964 ఏప్రిల్ 14న ముంబైలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రజల ప్రాణాలు రక్షించడంలో విధినిర్వహణలో భాగంగా 66 మంది అగ్నిమాపకశాఖ సిబ్బంది తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా మృతి చెందారని పేర్కొన్నారు. వారితో పాటు 336 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. వారికి గుర్తుగా అగ్నిమాపక వారోత్సవాలు వారం రోజులు జరుపుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం: ప్రస్తుతం వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మార్కాపురం ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రావు అన్నారు. శనివార ఆయన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కలిగించారు. సిగరెట్లు, బీడీలు తాగి రోడ్ల పక్కన పడేయటం వలన, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీక్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు.

అన్నదానం మహాదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామివారి రథోత్సవం సందర్భంగా వచ్చే భక్తులకు అన్నదానం చేయటం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శనివారం స్వామివారి రథోత్సవం సందర్భంగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక కంభం రోడ్డులోని వీరాంజనేయస్వామి దేవస్థానం వద్ద మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్‌లతో కలిసి ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక రీడింగ్ రూం ఆడిటోరియం వద్ద భక్తులకు మజ్జిగ అందజేశారు. నాయుడు బజార్, నెహ్రూ బజార్, దోర్నాల బస్టాండ్, కంభం రోడ్, పాత బస్టాండ్, మెయిన్ బజార్లలో పలు అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

స్పందించే హృదయాలు ట్రస్ట్‌కు ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పులి శ్రీనివాస ప్రసాద్

కంభం: తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్న స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్‌కు ఇండియా బ్రాండ్ ఐకాన్–2023 అవార్డు దక్కింది. శనివారం ముంబైలోని ఒక హోటల్లో టైమ్స్ సైబర్ మీడియా నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆస్ట్రేలియా మాజీ ఫాస్ట్ బౌలర్ బ్రెట్‌లీ చేతులమీదుగా టైమ్స్ సైబర్ మీడియా వైస్ చైర్మన్ పూజా ఠాకూర్ అవార్డును ప్రదానం చేశారు. తనకు అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిసామని పేర్కొన్నారు.

నేడు వైద్య శిబిరం

రాచర్ల: మండల కేంద్రంలో విద్వాన్ స్కూల్ ప్రాంగణంలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుగర్, బీపీ, గుండె, కిడ్నీ, కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

పెద్దారవీడు: మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌పై సోషల్ మీడియా, యూట్యూబ్ చానల్లో ప్రచారం చేస్తున్న కథనాలను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్టారెడ్డి తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం మార్కాపురంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలో దేవరాజుగట్టులో సచివాలయ కన్వీనర్ల సమావేశంలో మంత్రి సురేష్‌కు నిరసన సెగ అంటూ వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని చెప్పారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో ఏదేదో జరిగిపోతోందని కొంత మంది టీడీపీ నాయకులు చెప్పిన మాటలు విని యూట్యూబ్ చానల్ ప్రతినిధులు పనిగట్టుకొని అసత్యాలు ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. మండల సచివాలయ కన్వీనర్ ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, సొంటి నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు: ప్రభుత్వ సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ సేవలు అందించటంతో పలువురు వలంటీర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం తన దృష్టికి వచ్చిదన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి తక్షణం నోటీసులు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వజ్జా శ్రీనివాసరావును కోరారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేసి ప్రభుత్వ సేవలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్



వృద్ధురాలికి జగనన్న సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న సర్పంచ్



పుల్లలచెరువులో..

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం, చిన్నగుడిపాడు గ్రామాల్లో సర్పంచ్ మిండాల మంగమ్మ నాగయ్య ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్ ఎం.నాగేశ్వరరెడ్డి జగనన్న మా నమ్మకం, మా భవిష్యత్ అనే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి జగనన్న సంక్షేమం వివరించారు. ప్రజలతో మాట్లాడి వారు చెప్పిన విషయాలు నమోదు చేసుకున్నారు.

పుల్లలచెరువు: సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ అమలు జరుగుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లగా ప్రభుత్వం చేస్తున్న పథకాలు వివరిస్తూ గతంలో టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడా గమనించాలని, రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. సచివాలయ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ కోటిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీ రాములు, నాయకులు రఘు, వాసు, కాశయ్య, వెంకటేశ్వర్లు, సుందరరావు, మూర్తెయ్య, బచ్చయ్య, ఆంజనేయులు, గురునాథం, లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ప్రవీణ్ ప్రకాష్



ఓ విద్యార్థి ఇంటికి వెళ్తున్న ప్రవీణ్ ప్రకాష్

మార్కాపురం: రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ శనివారం మార్కాపురం మండలంలోని వేములకోట, మిట్టమీదపల్లి ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. లెక్కల్లో కొంతమంది విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని గమనించి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కొంత మంది విద్యార్థులు షూస్ లేకుండా రావటాన్ని గమనించి వెంటనే వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుల నిమిత్తం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతుందని అలాంటప్పుడు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎప్పటికప్పుడు వారి లోపాలను సరిదిద్దుతూ మంచి మార్కులు వచ్చేలా వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలన్నారు. సబ్ కలెక్టర్ సేతు మాధవన్, విద్యాశాఖ ఆర్జేడి సుబ్బారావు, డీఈఓ రమేష్, డిప్యూటీ ఈఓ చంద్రమౌళీశ్వర్, ఎంఈఓ రామదాసునాయక్ పాల్గొన్నారు.

మంత్రి కాకానిని కలిసిన నేతలు



మంత్రిని సన్మానిస్తున్న మద్దిశెట్టి రవీంద్ర, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి

తాళ్లూరు: వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌ను నెల్లూరులో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి కలిశారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గంగిరెడ్డిపాలెం యలమందారెడ్డి, కళింగ రెడ్డి నాయకుల వెంట ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొమరోలు: రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కొమరోలు మండలంలోని గోనపల్లె గ్రామానికి చెందిన పెద్దినేని రమణయ్య ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం కొమరోలుకు వచ్చి పని ముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామం గోనపల్లె గ్రామానికి వెళుతోంది. బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలోకి వెళ్లగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రమణయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రుడిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏఎస్‌ఐ గోపాలక్రిష్ణ విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.